క్లుప్తంగా

నేడు వైఎస్సార్ జయంతి

నూజివీడు: పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని వైఎస్సార్ సీపీ నాయకులు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కార్యాలయ వర్గాలు తెలిపాయి. వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమాల్లో కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనేలా నాయకులు కృషి చేయాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తామని ఆర్డీఓ వై. భవానీశంకరి తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అధికారులు స్వీకరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెంచిన గ్రాట్యూటీని 2018 నుంచి అమలు చేయాలి

మైలవరం: 2022కు ముందు రిటైర్ అయిన ఉద్యోగులకు పెంచిన గ్రాట్యూటీని అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం మైలవరం శాఖ అధ్యక్షుడు జె. నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి. కృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 11వ పీఆర్సీలో భాగంగా జూలై 2018 నుంచి రూ.12 లక్షలుగా ఉన్న గ్రాట్యూటీని రూ.16 లక్షల వరకు పెంచారని, దానిని జనవరి 01, 2022 నుంచి ఆచరణలోకి తీసుకువచ్చారని చెప్పారు. 2022 ముందు రిటైర్ అయిన ఉద్యోగులకు దీని వలన ప్రయోజనం చేకూరడం లేదన్నారు. కనుక 11వ పీఆర్సీలో పెరిగిన గ్రాట్యూటీని జూలై 2018 నుంచి అమలు చేయాలని నాయకులు కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): లయన్స్ క్లబ్ ఆఫ్ వీఆర్కే నగర మహిళా అధ్యక్షురాలిగా గుంటుపల్లి రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ దేవినేని కిషోర్‌కుమార్ పర్యవేక్షణలో సంస్థ పాలకవర్గం ఎన్నిక కొండపల్లిలో ఆదివారం జరిగింది. అధ్యక్షురాలిగా కొండపల్లి రాజేశ్వరి, ఉపాధ్యక్షులుగా శోభారాణి, మంజువాణి, కార్యదర్శిగా సూర్యకుమారి, కోశాధికారిగా జయగుణ, సహాయ కార్యదర్శిగా దేవీగీతామణితో పాటు మరికొందరు సభ్యులను ఎన్నుకున్నారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌గా దేవినేని జోనీకుమారితో పాటు మరో ఏడుగురు వ్యవహరిస్తారు. ఇప్పటివరకు సాధించిన విజయాలు, ఇప్పటి నుంచి చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలు వక్తలు వివరించారు. లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నూజివీడు అభివృద్ధిలో రాజ ముద్ర

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన పనులతో మనసున్న మారాజుగా ఈ ప్రాంత ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారు. వందల కోట్ల రూపాయలతో చేసిన అభివృద్ధి పనులతో ఆయనపై నూజివీడు ప్రాంత ప్రజలలో ఎన్నటికీ చెదరని ముద్ర పడింది.

- ట్రిపుల్ ఐటీ ఏర్పాటు
- నాలుగు వేల ఇళ్లతో మోడల్‌కాలనీ
- రూ.66 కోట్లతో కృష్ణాజలాల తరలింపు



జిల్లాలోనే పెద్దదైన ఎమ్మార్ అప్పారావు కాలనీ



కృష్ణా జలాల పథకం

నూజివీడు: జిల్లాలో నూజివీడు నియోజకవర్గంతో వైఎస్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. 2004 నుంచి 2009 వరకు ముఖ్యమంత్రి హోదాలో ఆయన మూడు సార్లు నూజివీడులో పర్యటించి వరాల జల్లులు కురిపించారు. నూజివీడులో 'వైఎస్ మార్కు' అభివృద్ధిని ప్రతిపక్షాలు సైతం ఒప్పుకుంటాయి. అప్పటి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు కృషితో పాటు, ఆయనపై ఉన్న ప్రత్యేక అభిమానంతో ఎమ్మార్ అప్పారావు కాలనీని ఏర్పాటు చేసి నాలుగు వేల మందికి నివేశన స్థలాలే కాకుండా నాలుగు వేల ఇళ్లు మంజూరు చేశారు. పట్టణ ప్రాంత ప్రజల దాహార్తిని శాశ్వతంగా పరిష్కరించేందుకు అపర భగీరథుడిలా కృష్ణా జలాల ప్రాజెక్టును రూ.66 కోట్లతో మంజూరు చేశారు. గత నాలుగేళ్లుగా ఈ పథకం ద్వారానే పట్టణ ప్రజలు 365 రోజులూ మంచినీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవనం సాగిస్తున్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రూ.1.5 కోట్లతో సమీకృత వసతి గృహం (ఇంటిగ్రేటెడ్ హాస్టల్)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దీనిలో 400 మంది పేద విద్యార్థులు చదువుతున్నారు. అలాగే రూ.7.50 కోట్లతో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల భవనాన్ని నిర్మించి దాదాపు 700 మంది పేదవర్గాల బాలికలు చదువుకునేందుకు సదుపాయాన్ని కల్పించారు.

ట్రిపుల్ ఐటీతో మారిన నూజివీడు రూపురేఖలు

నూజివీడులో ప్రతిష్టాత్మకమైన ట్రిపుల్ ఐటీని స్థాపించి పట్టణానికి దేశ పటంలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారు. వేలాది మంది పేద వర్గాల, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉన్నతమైన సాంకేతిక విద్య ఇక్కడ లభిస్తోంది.

రైతు బాంధవుడు వైఎస్..

నూజివీడు ప్రాంతంలో మామిడి పరిశోధనా స్థానం, ఉద్యాన పంటల చీడపీడల నియంత్రణ కేంద్రాన్ని రూ.12 కోట్లతో ఏర్పాటు చేశారు. ప్రకృతి ప్రతికూల పరిస్థితుల్లో 2007వ సంవత్సరంలో మామిడి పంట నష్టపోయిన రైతులకు రూ.25 కోట్ల నష్టపరిహారం మంజూరు చేశారు. అటవీ హక్కుల చట్టం ద్వారా జిల్లాలో 869 మందికి పట్టాలు దక్కితే ఒక్క నూజివీడు డివిజన్‌లోనే అత్యధికంగా 755 మందికి పట్టా లు ఇచ్చారు. రూ.1.5 కోట్లతో పెద్దచెరువుకు సాగర్ జలాలు అందించారు. రూ.1.10 కోట్లతో సుంకొల్లు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి బీడువారిన ఆయకట్టును సాగులోకి తెచ్చా రు. చాట్రాయి, విస్సన్నపేట మండలాల్లో 30,030 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.15.10 కోట్లతో నూతిపాడు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం అభివృద్ధిలో వైఎస్ వేసిన చెరగని ముద్ర కనిపిస్తోంది.

సామాజిక న్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

ఎమ్మార్పీఎస్ జాతీయ నేత మంద వెంకటేశ్వరరావు మాదిగ



రాయనపాడులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాయనపాడు(విజయవాడరూరల్): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సామాజిక న్యాయ దినోత్సవంగా ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. రాయనపాడు గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. తొలుత జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని సి గుడిపాడు దళితవాడలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేసేవిధంగా అందరూ కృషి చేయాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు విస్సంపల్లి సీతయ్య, జానేశు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జెండాను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తోందని నాయకులు తెలిపారు.

ముసునూరు: ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు దుబ్బాకు దేవరాజు ఆధ్వర్యంలో ఆదివారం పలు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ పతాకాలను ఆవిష్కరించి, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్ మాట్లాడారు. లోపూడిలో ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు.

నేడు నేత్ర వైద్యశిబిరం

విస్సన్నపేట: భగవాన్ సత్య సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక సత్య సాయి సేవా సమితిలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ట్రస్ట్ అధ్యక్షుడు జగ్గవరపు రంగారెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి పరీక్షలు నిర్వహించి శుక్లాలు ఉన్న వారికి నూజివీడు అమెరికన్ హస్పటల్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని చెప్పారు. పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా జగన్నాథ రథ యాత్ర మహోత్సవం



భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడిలో జగన్నాథ రథ యాత్ర ఆదివారం వైభవంగా సాగింది. కరకట్ట దిగువునగల జగన్నాథ మందిరం నుంచి అయ్యప్ప స్వామి దేవస్థానం ప్రాంగణంలోని ఫంక్షన్ హాల్ వరకు రథ యాత్ర సాగింది. అనంతరం అయ్యప్ప స్వామి పంక్షన్ హాల్‌లో కూచిపూడి, భరత నాట్యం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు, హరేకృష్ణ భక్త బృందంతో సంకీర్తనలు, భజనలు, స్వామీజీల ప్రవచనాలు జరిగాయి. టెంపుల్ డైరెక్టర్ దయానిధి దాస్ మాట్లాడుతూ జగన్నాథ రథ యాత్ర మహోత్సవ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ జరిగింది. బీజేపీ నాయకుడు నూతులపాటి బాలకోటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చనుమోలు వెంకట్రావుకు నివాళి

జి.కొండూరు: దివంగత మాజీ మంత్రి చనుమోలు వెంకట్రావు వర్ధంతి కార్యక్రమం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వేములకొండ సాంబశివరావు ఆధ్వర్యంలో జి.కొండూరులో ఆదివారం నిర్వహించారు. స్థానిక పులివాగు పక్కనే ఉన్న చనుమోలు వెంకట్రావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, మాజీ కేడీసీసీ వైస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, సర్పంచ్ మండల అరుణ, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం

బలివే (ముసునూరు): బలివే రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన సేద్యపు భూముల కౌలు వేలం ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సతీష్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. రైతులు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

గ్రామ దేవతకు శాకంబరీ అలంకరణ

గంపలగూడెం: ఆషాఢ మాసం సందర్భంగా గంపలగూడెం ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత గ్రామ దేవతకు పంచామృతాలు, జలంతో అభిషేకం జరిపారు. అనంతరం అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. శాకంబరీ అలంకరణలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

పూర్వ విద్యార్థుల సాయం

తిరువూరు: పట్టణంలోని నిరుపేద విద్యార్థులకు 1995–97 బ్యాచ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. 8, 9 తరగతులు చదివే విద్యార్థులు షేక్ కరీముల్లా బాబా, యాసిఫ్ ఇమ్రాన్‌లకు రూ.10 వేల నగదును పుస్తకాల కొనుగోలు, ఫీజుల చెల్లింపు నిమిత్తం సంఘ ప్రతినిధులు కంచడపు రమేష్, మొహిద్దీన్, విష్ణు, సత్యనారాయణ అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత

రెడ్డిగూడెం: వెలగలగూడెం గ్రామానికి చెందిన ఆరో తరగతి విద్యార్థి మల్లెల కారుణ్య సాగర్‌కు సూర్యా హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత ఆకుల సూర్యకిరణ్ రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. సూర్యకిరణ్ మాట్లాడుతూ కారుణ్య సాగర్ చదువులో రాణించాలని ఆకాంక్షించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

తిరువూరు: కోకిలంపాడు శివారు సంజీవపురం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన అనుమోలు నరసింహారావును తిరువూరు సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. సేవా సమితిలో విద్యా విభాగ కో-ఆర్డినేటర్‌గా కూడా నరసింహారావు విశేష సేవలందిస్తున్నారని పలువురు కొనియాడారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలనులోని ఓ గృహంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు శనివారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. ఎస్ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంటిపై దాడి చేసి ఐదుగురు విటులను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకురాలితోపాటు ఐదుగురు విటులను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు.

డిమాండ్స్ డేను విజయవంతం చేయండి

ఇబ్రహీంపట్నం: కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఈనెల 10న మండల కేంద్రాలు, పారిశ్రామికవాడల్లో నిర్వహించనున్న డిమాండ్స్ డేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ కోరారు. ఇబ్రహీంపట్నం సీఐటీయూ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.